వక్ఫ్ అమెండ్‌మెంట్ చట్టాన్ని రద్దు చేసేవరకు పోరు

● పలు పార్టీలు, ప్రజాసంఘాలు, ముస్లిం మతగురువులు



ఏడు రోడ్ల కూడలిలో నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కడప మారుతీనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్ అమెండ్‌మెంట్ చట్టాన్ని రద్దు చేసేవరకు పోరు సాగిస్తామని పలు పార్టీల, ప్రజా సంఘాల, ముస్లిం మతగురువులు తేల్చి చెప్పారు. ఇందుకు నిరసనగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గౌస్‌నగర్ నుంచి నగర ప్రధాన సర్కి ల్స్ మీదుగా ఏడు రోడ్ల కూడలి వరకు లాంగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ అమెండ్‌మెంట్ నల్ల చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీం కోర్టులో రిట్ పిటీషన్ దాఖ లు చేశామన్నారు. ఆ మేరకు లోక్‌సభ, రాజ్యసభలో తమ పార్టీ తరపున బిల్లును వ్యతి రేకించడం జరిగిందన్నారు. ఆ బిల్లు పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని.. కాబట్టే తాము పోరాటం సాగిస్తున్నామన్నారు. కోట్లాది ముస్లిం ప్రజల మనోభావాలు గుర్తెరిగి కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింలను అణగదొక్కే చర్యలకే ప్రాధాన్యతనిచ్చేలా పాలన సాగిస్తోందన్నారు. ఇప్ప టికైనా కేంద్రం ముస్లింల అణచివేసే ధోరణికి స్వస్తి పలికి తెరపైకి తెచ్చిన వక్ఫ్ నల్ల చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడ తామని హెచ్చరించారు. కాగా, లాంగ్‌మార్చ్‌లో పాల్గొనేందుకు ఏడు రోడ్ల కూడలికి చేరుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబుకు సంబంధిత నిర్వాహకుల నుంచి నిరసన సెగ తగిలింది. దీంతో ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారు. కార్యక్ర మంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, సీపీఎం నాయకులు చంద్రశేఖర్, ఆర్‌సీపీ నాయకులు ఎన్.రవిశంకర్‌రెడ్డి, సీపీఐ నాయకులు వెంకటశివ, ముస్లిం మత పెద్దలు బాబు బాయ్, ఇషాక్‌మౌలానా, పెద్ద ఎత్తున ముస్లింలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజా ఫౌండేషన్ ఆస్తులపై

గద్దల కన్ను



● అనాథలకు డాడీగా రాజారెడ్డి
● ప్రొద్దుటూరు, మైలవరంలో విద్యాసంస్థలకు విలువైన ఆస్తులు
● రాజారెడ్డి ఆకస్మిక మరణంపైనే అనుమానాలు
● మైలవరంలో 50 ఎకరాల భూఆక్రమణలపై కలెక్టర్ కొరడా

దాడీ హోం భూములు స్వాధీనం



(కడప - ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ భూకబ్జాదారులకు వణుకు పుట్టిస్తున్నారు. జగన్ హయాంలో అడ్డగోలుగా అధికారుల అనుమతి తీసుకుని భూములు కొట్టేసి ఎంజాయ్ చేస్తున్న జగన్ గ్యాంగ్‌పై కలెక్టర్ కొరడా ఝులిపించి.. కబ్జాకు గురైన విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటూ వస్తున్నారు. అందుకు బాధ్యులైన వారిని ఊచలను లెక్కబెట్టించారు. అయితే ఇప్పుడు మైలవరం, ప్రొద్దుటూరు సమీపంలో అనాథలు, పేద విద్యార్థుల కోసం ఎంతో ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన డాడీహోం, పూజ ఇంటర్నే షనల్ స్కూలు ఆస్తులపై కొన్ని విషనాగులు కన్నేశాయి. విలువైన ఆ భూములను అడ్డదారిలో అమ్మేందుకు యత్నిస్తుండగా.. వాటికి కలెక్టర్ బ్రేక్ వేసి ఆ భూములను ఇప్పుడు తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

ఎక్కడెక్కడో ఉన్న అనాథ పిల్లలను అక్కున చేర్చుకుని.. వారి కోసం మైలవరంలో డాడీహోంను రాజారెడ్డి స్థాపించారు. వారికి విద్యాబుద్దులు చెప్పించి ఉన్నతస్థాయిలో నిలబెట్టారు. అదే సమయంలో ప్రొద్దుటూరు సమీపంలోని చౌడూ రులో పూజా ఇంటర్నేషనల్ స్కూలును కూడా స్థాపించారు. ఈ స్కూలుకు ఆస్తులు చాలానే ఉన్నాయి. ఇక్కడ భూములు చాలా విలువైనవి. ఎకరం రూ.3కోట్లు పైమాటే. మైలవరం, ప్రొద్దుటూరు సమీపంలో ఉన్న ఆస్తులు చాలా విలువైనవి. అయితే డాడీ హోం నిర్వాహకుడు రాజారెడ్డి అవివాహితుడు. రాజారెడ్డి 2023 ఆగస్టు 12న అను మానాస్పదస్థితిలో మృతి చెందారు.

కోట్లాది రూపాయల ఆస్తులపై కన్ను

రాజా ఫౌండేషన్ పేరిట మైలవరం డాడీహోం, ప్రొద్దుటూరు సమీపంలో చౌడూరు వద్ద పూజ ఇంటర్ నేషనల్ స్కూలులకు వేలాది ఆస్తులున్నాయి వాటిని కాజేసేందుకు ఓ బ్యాచ్ కన్నేసింది. పులివెందులకు చెందిన వైసీపీ అధికారం రాకముందు కీలక నేత చిన్ననాటి స్నేహితుడు, ఓ వ్యక్తి బంధువును పెళ్లి చేసుకున్న క్రిష్ణా జిల్లాకు చెందిన ఒకరు రాజా ఫౌండేషన్‌లో తిష్ట వేశారు. వైసీపీ హయాంలో ఉద్యోగాలు ఇప్పిస్తా మంటూ భారీ స్థాయిలో డబ్బులు వసూలు చేసినట్లు చెబుతారు. అప్పట్లో జగన్ పేరు చెప్పుకుని జగన్‌కు చిన్ననాటి స్నేహితుడుగా ముద్రపడ్డ ఓ వ్యక్తి పేరు చెప్పుకుని భారీ స్థాయిలో సెటిల్‌మెంటు చేశారు. పరిటాల రవి సూట్‌కేసు బాంబులో ఓ వ్యక్తి పేరుం ది. అతని బంధువే ఇప్పుడు రాజాఫౌండేషన్‌లో శాసిస్తున్న వ్యక్తిని పెళ్లి చేసుకున్నా రంటారు. పులివెందులలో సంబంధాలు పెట్టుకుని రాజారెడ్డి మర్డరు తరువాత విజయవాడ ఫ్యామిలీ ఎంటర్ అయి ఆస్తులు కొట్టేసే యత్నం చేయడం గమనార్హం. రాజారెడ్డి మరణం తరువాత అక్కడ బాధ్యతలను అక్కడే ఉంటున్న ఓ అనాథకు అప్పగించారు. రాజారెడ్డి డాడీ హోం మరదలు ప్రసన్నలక్ష్మి, సోదరుడు శ్రీధర్‌రెడ్డి కీలకంగా ఉండేవారు. అయితే రాజారెడ్డి వారిని బాధ్యతల నుంచి తప్పించారు. ఈ నేపథ్యంలో 2023 ఆగస్టు 12న రాజారెడ్డి మృతి చెందారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడంతో అనుమానాస్పద మృతిగా ఉండి చివరికి హత్యగా తేలింది. గుండెపోటుగా ధ్రువీకరించిన తమ్ముడు, మరదలతో పాటు డాక్టరు కూడా జైలుబాట పట్టారు.

పులివెందుల పరిచయాలే పెత్తనం

విజయవాడకు చెందిన భార్య భర్తలు యువనేత చిన్ననాటి స్నేహితుడికి బంధుత్వం ఉంది. దాన్ని అడ్డుపెట్టుకుని చిన్నగా ఇక్కడ డాడీ హోంలో ఎంట్రీ అయ్యారు. విజయవాడ నేత తల్లిపేరు తండ్రి పేరు వైఎస్‌గా పెట్టుకుని మిగతా పేరును రెడ్డిగా మార్చుకుని ఇక్కడ పెత్తనం చెలాయించేవారంటారు. యువనేత అప్పటి సీఎం చిన్ననాటి స్నేహితుడు ఫ్రెండ్ ఫ్యామిలీ కావడంతో అతను ఎప్పుడు వచ్చినా కూడా పోలీసు ప్రోటోకాల్ ఉండేది. అలా పులివెందుల పరిచయాలు పెంచుకుని డాడీ హోంలో పాగా వేసి మొత్తం ఆ సంస్థనే తన ఆధీనంలోకి తీసుకున్నారు. రాజారెడ్డి మరణంపై పెద్దవివాదమే రేగింది. దీనిపై ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో సిట్ ఏర్పాటు చేసింది. అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేసిన విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో సిట్ రాజారెడ్డి మరణంపై విచారణ జరిపింది. అయితే ఇందులో అసలు విషయాలు బయటికి వచ్చాయి. రాజారెడ్డి ఆస్తులపై యువనేత సన్నిహితుడు, కుటుంబ సభ్యుల హస్తం ఉన్నట్లు నిర్ధారించినట్లు సమాచారం. అదే సమయంలో కలెక్టరు చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించారు. పులివెందుల యువనేత సన్నిహితుడు కుటుంబ సభ్యులు ఈ ఫౌండే షన్‌లో తిష్టవేశారు. యాక్చువల్‌గా విజయవాడకు చెందిన వ్యక్తి ఇక్కడ కీలక పదవిలో ఉండే అవకాశం లేదు. ఏదోరకంగా తిష్టవేసి కొందరిని ట్రాప్ చేసి పదువులు తీసుకున్నాడంటారు. ఇందులో భాగంగా విలువైన ఆస్తులపై కన్నేసిన ఆ బ్యాచ్ రాజా ఫౌండేషన్ చెందిన 50.47 ఎకరాలను అమ్మేందుకు ప్రయత్నించగా వాటిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. కబ్జా బ్యాచ్‌కు యంత్రాంగం ఊహించని విధంగా షాక్ ఇచ్చింది.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

● కలెక్టరు చెరుకూరి శ్రీదర్

(కడప - ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఆక్రమిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ స్పష్టం చేశారు. 'రూ.30 కోట్ల పాతకడప చెరువు కబ్జా కహానీ' అంటూ ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో కలెక్టరు శ్రీధర్, కడప ఆర్డీవో కలిసి కడపలోని పాతకడప చెరువును పరిశీలించారు. చెరువు పక్కనే లెవలింగ్ చేయడం, నిబంధనల ప్రకారం వంద మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదు. అయితే ఇక్కడ నిర్మాణాలకు అవసరమైన లేఅవుట్ వేయడం చూసి ఆగ్రహించారు. ఇక్కడకు గ్రావెల్ ఎక్కడ నుంచి వచ్చిందని మండిపడ్డారు. పాతకడప చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువు బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. అయితే ఇక్కడ ఏకంగా నిర్మాణాల కోసం వెంచరు వేయడంపై కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు విస్తరణ పై సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని ఆర్డీవో జాన్ ఇర్విన్‌ను ఆదే శించారు. చెరువు ఆక్రమించేసి వెంచర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, తహసీల్దారు నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాతకడప చెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న కలెక్టరు, ఆర్డీఓ



మహానాడు పనులు ప్రారంభం

● ప్రారంభించిన ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



టెంకాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, చిత్రంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, తదితరులు

సీకేదిన్నె, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు వేదిక స్థలం చదును పనులను ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిలు ప్రారంభించారు. కడపలో మొట్టమొదటిసారిగా నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేసేందుకు నాయకులు కృషి చేస్తున్నారు. మహానాడు నిర్వహణకు పలుచోట్ల స్థలాలను పరిశీలించిన టీడీపీ నాయకులు చివరకు కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె పరిధిలోని పబ్బాపురం వద్ద స్థలాన్ని ఖరారు చేశారు. మహానాడుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి లక్షలాదిగా కార్యకర్తలు వచ్చే అవకాశం ఉండటంతో దానిని దృష్టిలో ఉంచుకుని పబ్బాపురం వద్ద చెర్లోపల్లె పొలంలో రింగ్ రోడ్డుకు ఆనుకుని 120 ఎకరాల్లో స్థలాన్ని చదును చేసే పనులు మొదలుపెట్టారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మహానాడు నిర్వహించనున్నారు. స్థానిక నాయకుల సహకారంతో పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రింగ్ రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, అదేవిధంగా దాదాపు 25-30 వేల వరకు వచ్చే ప్రతినిధులకు బస ఏర్పాటు చేసేందుకు కూడా సమీపంలో కల్యాణ మండపాలు విద్యాసంస్థలు ఉండడంతో ఎంతగానో అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. మహానాడు వేదిక కడప ఎయిర్‌పోర్టుకు కూడా దగ్గరగా ఉండటంతో అందరికీ అనుకూలంగా ఉంటుందని నాయకులు భావిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, స్థానిక నేతలు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చక్రస్నానం

● పుష్పయాగం వైభవోపేతం



పవిత్ర పెన్నా నదిలో చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

వల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిట్టచివరి రోజు ఆదివారం పంచమ నదీ సంగమంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఘనంగా చక్ర స్నానం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో ఉన్న కామాక్షి సమేత వైద్యనాధేశ్వరుడు, కొండపైన చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను, త్రిశూల శ్రీచక్రాలను పవిత్ర పినాకినీ నది ఒడ్డుకు తీసుకువచ్చి పంచామృతాలతో విశేషంగా అభి షేకం చేశారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల నడుమ నదిలో శ్రీచక్ర స్నానం చేయించారు. అనంతరం విగ్రహాలతో పాటు శ్రీచక్ర త్రిశూలాలను ఆయా దేవస్థానంవద్దకు మేళతాళాల నడుమ తీసుకెళ్లి.. మహాపూర్ణాహుతి గావించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుడికి కొండపై వివిధ రకాల పూలతో పుష్పయాగం నిర్వహించి.. గత తొమ్మిది రోజులుగా బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. చక్రస్నానంతో పాటు పుష్పయాగానికి తరలివచ్చిన భక్తులకు కార్య నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

ప్రశాంతంగా నీట్

● 97శాతం మంది హాజరు
● కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సూచనలు ఇస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్



పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎన్‌టీఏ నీట్-2025 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. 97 శాతం మంది హాజరైనట్లు తెలిపారు. కడప, ప్రొద్దుటూరులోని మొత్తం 8 పరీక్ష కేంద్రాలలో 2371 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకోగా 2311 మంది (97శాతం) హారుకాగా, 60 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

కడప నగర పరిధిలోని ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్, నాగరాజుపేట, ప్రభుత్వ జూనియర్ కలాశాల (గర్ల్స్), మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూ ల్, ఎంసీహెచ్‌ఎస్ మెయిన్, అన్నమయ్య సర్కిల్, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం, వైఆర్‌జడ్పీహెచ్ స్కూల్ (గర్ల్స్) పరీక్ష కేంద్రాలలో నమోదు చేసుకున్న 1839 విద్యార్థుల్లో 1788 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజ రయ్యారు. ప్రొద్దుటూరు పరిధిలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ (మెయిన్), వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న 532 మంది విద్యార్థుల్లో 523 మంద హాజరు కాగా 9 మంది గైర్హారయ్యారు.

కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

కడప నగరంలోని నీట్ పరీక్ష కేంద్రాల వద్ద ఆదివారం జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. నీట్ పరీక్ష కేంద్రాలైన కోటిరెడ్డి మహిళా కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మున్సిపల్ హైస్కూల్ మెయిన్, జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలకోన్నత పాఠశా లలను ఎస్పీ సందర్శించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసి వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్ష కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో గుంపులు లేకుడా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నీట్ పరీక్ష నియమ నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. కడపవన్ టౌన్ సీఐ బి.రామకృష్ణ, తాలూకా సీఐ టి.రెడ్డప్ప, టూటౌన్ సీఐ బి.నాగార్జున, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

దాహం.. దాహం



హమ్మయ్య.. ఇక్కడ నీళ్లు ఉన్నట్టున్నాయ్



ఖచ్చితంగా దీని లోపల నీళ్లుండాయ్... తాగేదెట్టా..!



ఉన్నాయ్.. ఉన్నాయ్..

అసలే వేసవి తాపం.. మండుతున్న ఎండలు.. తడారిపోతున్న గొంతు.. చుక్క నీరు కనిపిస్తే చాలు.. పోతున్న ప్రాణం లేచొచ్చినట్లు అనిపిస్తుంది. ఈ పరిస్థితి మనుష్యులకే కాదు.. పశు పక్ష్యాదులు సైతం దాహార్తి తీర్చుకునేందుకు నానా పాట్లు పడుతున్నాయి. ఈ క్రమంలో మండల కేంద్రం సిద్దవటం విద్యుత్ కార్యాలయం వద్ద తాగునీటి కొళా యి నుంచి బొట్టు బొట్టుగా కారుతున్న నీటి చుక్కలను ఒడిసి పట్టుకున్నట్లు పక్షులు తాగుతున్న దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



సర్కస్ ఫీట్లు చేసినా చుక్క నీరందడం లేదే...!



బతుకు జీవుడా...

కనపడకుండా పోయిన వ్యక్తి దారుణ హత్య





దార మునయ్య (ఫైల్)

కుళ్లిపోయి ఉన్న మృతదేహం..

ఒంటిమిట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి): కనపడకుండా పోయిన వ్యక్తి శవమై కనిపించాడు. ఈ సంఘటన ఒంటిమిట్ట మండలంలోని చింతరాజుపల్లె గ్రామంలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన దార మునయ్య (48) ఏప్రిల్ 28వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు ఏప్రిల్ 29న ఒంటిమిట్ట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి పలుచోట్ల గాలిస్తున్నారు. ఆదివారం ఉదయం మేకలు మేపుకునేవారు అడవికి వెళుతుండగా చింతరాజుపల్లె సమీపంలోని ఎరుకులపాలెం-బోయపాళెం మధ్యలో శివాలయం వెనుక ఉన్న వంకలో ఒక మృతదేహం కనిపించింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉంది. శరీరంపై పలు గాయాలున్నాయి. తలను పూర్తిగా పగలగొట్టబడి ఉంది. మృతుడిపై ఆర్ఎస్ కేసులు కూడా నమోదై ఉన్నాయి. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య జీవనోపాధికై కువైత్‌లో ఉంది. ఈ హత్యకు అక్రమ సంబంధం కారణమై ఉంటుందని పలువురు మాట్లాడుకుంటున్నారు. విషయం తెలియడంతో సీఐ బాబు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోవడంతో సంఘటన స్థలంలోనే వైద్యులు పంచనామా నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన శ్రీకాంత్

మదనపల్లె అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు డ్యూ చెల్లించలేక మదనపల్లె మండలంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లె మండలం మేంపల్లె గ్రామం జంగాలపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు శ్రీకాంత్ (25) మదనపల్లె పట్టణంలో ఓ మార్టులో పని చేస్తూ ఇటీవలే పనిమానేశాడు. క్రెడిట్ కార్డుపై ఉన్న రూ.లక్ష అప్పులో సుమారు రూ.60వేల వరకూ చెల్లించాడు. మిగిలిన మొత్తం చెల్లించలేకపోవడంతో ప్రైవేట్ బ్యాంకు అధికారులు ఇంటి వద్దకు వెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఆదివారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

అవమానం భరించలేక ఆత్మహత్య

ఎర్రగుంట్ల, మే 4(ఆంధ్రజ్యోతి): మామ ఇంట్లో జరిగిన దొంగతనంపై తనను అనుమానిస్తున్నట్లు భావించి ఎర్రగుంట్ల వినాయకనగర్‌కు చెందిన నూకనబోయిన ఆంజనేయులు(30) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాల్లోకెళితే.. 2025 మార్చి నెలలో ఎర్రగుంట్ల వినాయకనగర్‌లోని నాపరాయి పరిశ్రమలో పనిచేస్తున్న పీరయ్య ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. ఈ చోరీలో బంగారు ఆభరణాలు, డబ్బు, బాండ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై పోలీసులు ఇప్పటికీ విచారణ జరుపుతూనే ఉన్నారు. అయితే పీరయ్య అల్లుడైన ఆంజనేయులును అనుమానిస్తున్నట్లు వదంతులు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న అతను అవమానంగా భావించి ఆదివారం మామ అయిన పీరయ్య ఇంట్లోని బాత్‌రూంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆంజనేయులుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని శవం లభ్యం



పోరుమామిళ్ల, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరుమామిళ్ల చెరువులో ఆదివారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ కొండారెడ్డి సిబ్బందితో వెళ్లి బోటు సహాయంతో చెరువులో ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 40-45 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎరుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. ఇతని ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9121100631, 9121100630కు ఫోను చేయాలన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా.. ఒకరు మృతి



మృతి చెందిన సింహాద్రి

కాశినాయన, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసనపల్లె సమీపంలో ఆదివారం టాటాఏస్ వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పోరుమామిళ్లకు చెందిన షామియానా సప్లయర్స్ ఆకులనారాయణపల్లెలో జరిగిన సంవత్సరీకం(వర్ధంతి) కార్యక్రమానికి టెంట్, వంట సామాన్లు వేశారు. కార్యక్రమం ముగియగానే వాటిని ఆటోలో తీసుకొని వస్తుండగా బసనపల్లె సమీపంలోని రోడ్డు మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో సప్లయర్స్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్న రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన పెద్దవెంగయ్య కుమారుడు సింహాద్రి(18)కి తీవ్రగాయాలయ్యాయి. 108వాహనంలో పోరుమామిళ్లకు తీసుకుపోతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లీకొడుకు అదృశ్యం పై కేసు నమోదు



అదృశ్యమైన గాయత్రి, అఖిల్

రామసముద్రం, మే 4(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని ఎర్రబోయనపల్లెకు చెందిన గంగాధర్ భార్య గాయత్రి(26), వీరి కుమారుడు అఖిల్(3)తో కలిసి ఈనెల 3వ తేదీన ఇంటి నుండి వెళ్లిపోయింది. భర్త గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సరుకుల గోడౌన్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్

● రూ.7లక్షల నష్టం

వాల్మీకిపురం, మే 4(ఆంధ్రజ్యోతి): సరుకుల గోడౌన్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన ఆదివారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. చింతపర్తి గ్రామానికి చెందిన వ్యాపారి వెంకటేష్‌శెట్టి సూపర్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని డీఎస్పీ వీధిలో వెంకటేష్‌కు సంబంధించిన సరుకుల గోడౌన్ ఉంది. ఈ గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి సరుకులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సరుకులన్నీ పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.7లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



అంతా తానై..

● నియామకం ఒక చోట.. విధులు మరోచోట
● సమస్య సృష్టికర్త.. పరిష్కారకర్త ఆయనే
● డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పెత్తనం

వైద్య ఆరోగ్య శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించే ఓ అధికారికి నియామకం ఒకచోట అయితే విధులు నిర్వర్తించేది మాత్రం మరోచోట. మరో పీహెచ్‌సీలో పనిచేస్తున్నారనుకుంటే పొరపాటే. ఏకంగా పులివెందులలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే తిష్ట వేశారు. సమస్యను తెరపైకి తెచ్చి తానే పరిష్కరిస్తూ ఉన్నతాధికారుల వద్ద మెప్పు పొందుతుంటారని పలువురు చెబుతున్నారు. అతికొద్ది కాలంలోనే తన ముద్ర వేసుకొని వైద్య సిబ్బందిని శాసించేస్థాయికి ఎదిగిపోయారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

పులివెందుల రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆయన డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది హాజరు నమోదు (ఎఫ్ఆర్ఎస్)లో కూడా వేలుపెట్టి అందరికి ఫోన్లు చేస్తూ ఇబ్బందిపెడుతుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఫీల్డులో ఉన్నామనే విషయం తెలిసి కూడా ఫోన్లు చేస్తుంటారని అంటున్నారు. నియోజకవర్గంలోని వేముల, చక్రాయపేట, తొండూరు, సింహాద్రిపురం, లింగాల తదితర మండలాలతో పాటు పులివెందుల ఏరియా ఆసుపత్రిలో వ్యవహారాలన్నీ ఈయనే చూస్తుంటారనేది బహిరంగ రహస్యం. వీటితో పాటు పాడా ద్వారా చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణాలు, కొనుగోలు చేసిన సామగ్రిని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారని పలువురు ఉద్యోగులు, సిబ్బంది అంటున్నారు. అవసరం లేని వాటిని కొనుగోలు చేసి వాటిని మూలకు చేర్చి పక్కదారి పట్టిస్తుంటారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఆయనకు నచ్చితే..

ఓ ఉద్యోగిని తప్పుడు డాక్యుమెంట్లతో ఉద్యోగం పొందిందనే విషయాన్ని విలేకరులకు, పలువురికి సమాచారం ఇవ్వడం, వారు వెళ్లి ప్రశ్నించి బయటకు రాగానే.. మనవాళ్లే ఉండనీ.. అంటూ వినమ్రంగా చెప్పి ఆ సమస్యకు పరిష్కారం చూపుతుంటారని చెబుతున్నారు. జీతాలు, బిల్లుల విషయంలో సమస్యలు తెచ్చి ఆయనే పరిష్కరిస్తుంటారని వైద్య ఆరోగ్యశాఖలో ప్రచారం ఉంది. అంతేకాకుండా ఈయనకు నచ్చిన ఉద్యోగులపై తీవ్రమైన ఆరోపణలు కూడా తుడిచిపెట్టగలిగే స్థాయి ఈయనదని చెబుతారు. పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించాల్సిన ఓ ఉద్యోగిని ఇంటి వద్ద కూర్చొని సొంత పనులు చూసుకునేలా చేయగలిగిన సత్తా ఈయనకు ఉంది. దీనిపై ఇప్పటికీ ఆరోపణలు ఉన్నాయి. పులివెందుల నియోజకవర్గంలో ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ పాతుకుపోయిన వారు అనేక మంది ఉన్నారు. వీరు బదిలీల సమయంలో ఏదొక ప్రాంతానికి వెళ్లాల్సి వస్తే వారికి తన సలహాలతో ఎక్కడకు వెళ్లకుండా చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని చెబుతారు.

నివేదికలు ఇచ్చేది ఈయనే..

పులివెందుల చుట్టుపక్కల ప్రాంతాల్లో నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రథమ చికిత్స కేంద్రాలు అనేకం ఉన్నాయి. పులివెందుల ప్రాంతంలో ఒక్కరిద్దరు తప్ప ఎవరు కూడా నిబంధనలు పాటించరనేది బహిరంగ రహస్యం. వీటిని తనిఖీలు చేయాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడరు. వీటిపై ఆరోపణలు వచ్చినపుడు డిప్యూటీ డీఎంహెచ్‌వోతో పాటు ఆ సీనియర్ అసిస్టెంట్ కూడా వెళ్తారు. తనిఖీల అనంతరం ఈయన రంగంలోకి దిగి వ్యవహారం అంతా నడిపిస్తానని వారికి భరోసా ఇస్తుంటారని సమాచారం. జిల్లాస్థాయి అధికారుల వద్ద సమస్య పరిష్కారకర్త అని పేరు ఉండడంతో ఈయన తీర్పు ఫైనల్ అవుతుంది.

డిప్యూటీ డీఎంహెచ్‌వో ఏమన్నారంటే..

సీనియర్ అసిస్టెంట్ విషయంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో (పీహెచ్‌సీ) ఖాజామొయిద్దీన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పులివెందుల పరిధిలో ఆయన చాలా కాలంగా ఉంటున్నారు కాబట్టి ఆయనకు అన్నీ తెలుసు. విచారణలకు, తనిఖీలకు కొన్నిసార్లు నేను వెళ్లను ఆయననే పంపిస్తుంటాను. నా వద్ద విధులు నిర్వహించేందుకు పర్మిషన్ తీసుకున్నానని సెలవిచ్చారు. ఆ సీనియర్ అసిస్టెంట్ అంటే గిట్టని వాళ్లు చాలామంది ఉన్నారని డిప్యూటీ డీఎంహెచ్‌వో చెప్పడం కొసమెరుపు.

నేడు టాప్-10 విద్యార్థులకు సత్కారం

● ఎంఈఓలు తప్పక హాజరుకావాలి
● డీఈవో షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని శిల్పారామంలో ఈనెల 5వ తేదీ సాయంత్రం 4.30గంటలకు పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన టాప్-10 విద్యార్థులను విద్యాశాఖ ఆధ్వర్యంలో సత్కరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరవుతారని అన్నారు. అలాగే వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎంఈవోలంతా తప్పకుండా హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

నేడు ప్రజావాణి

కడప,కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 10 గంటల నుండి కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందని, జిల్లాలోని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ 1100ను ప్రభుత్వం ప్రారంభించిదని, అర్జీదారుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆ సమాచారం తెలుసుకోవడానికి ఈ 1100 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు.

ఆశయ సాధనకు మారుపేరు భగీరథ మహర్షి

● జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ అదితి సింగ్

కడప కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): అకుంఠిత దీక్ష, పట్టుదలలో ఏ ప్రయత్నంలోనైనా విజయం సాధించవచ్చని భగీరథ మహర్షి జీవిత సారాంశం తెలుపుతుందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరుగున పడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాళలలు చేపట్టడం అభినందనీయన్నారు. భగీరథ మహర్షి ఎంతటి కష్టాన్నైనా లెక్క చేయకండా అనుకున్నది సాధించే తత్వం గలవారన్నారు. మాట్లాడుతూ భగీథ మహర్షి సేవా నిరతి గొప్పదని, ముందుగా అపర భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, బీసీ సంక్షేమశాఖాధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంఘం నేత అవ్వారు మల్లికార్జున, జేవీ రమణ, రమణయ్య, మాదాసు మురళి, సుబ్బరాయుడు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తొలి ముస్లింవాద రచయిత సత్యాగ్ని

● ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి



సత్యాగ్ని దంపతులను సత్కరిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీలోకంలో తొలి తెలుగు ముస్లింవాద రచయితగా షేక్ హుస్సేన్ (సత్యాగ్ని) చిరస్మరణీయ స్థానాన్ని ఆక్రమించారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రచయితల సంఘానికి గౌరవాధ్యక్షుడిగా సేవలందిస్తున్న సత్యాగ్నిని ఆయన స్వగృహంలో కలిసి ఆరోగ్యం, యోగక్షేమాలను విచారించారు. ఆ మేరకు ఆయన చేసిన సాహిత్యకృషిని కొనియాడుతూ సత్యాగ్ని దంపతులను సత్కరించారు. ముస్లింల జీవిత విధానాన్ని పరిశీలించి సమగ్ర అవగాహనతో ఆయన కథలు రాశారన్నారు. అనంతరం ఉపాధ్యక్షుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ షేక్ హుస్సేన్ ముస్లిం స్త్రీల సమస్యలను మొదటిసారిగా ప్రపంచానికి చాటిచెప్పిన సంస్కరణవాదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, కోశాధికారి కె. రెడ్డిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కోర్టు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

● హైకోర్టు జడ్జిలకు వినతి

కడప రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో క్రిమినల్ కోర్టు భవన నిర్మాణంతో పాటు న్యాయవాదుల సంఘ భవనం పైఅంతస్తు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తిలకు కడప బార్ అసోసియేషన్ విన్నవించింది. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రవదన, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి తదితర కార్యవర్గ సభ్యులు నగరంలోని స్టేట్ గెస్టుహౌస్‌లో న్యాయమూర్తులను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. క్రిమినల్ కోర్టు నిర్మాణాలకు తగు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఈ మేరకు చర్యలను తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేశారు.



హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన కడప బార్ అసోసియేషన్ నాయకులు

ఆటో బోల్తా.. ఒకరు మృతి

● ఇద్దరికి గాయాలు

బద్వేలుటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మండలం రాజుపాలెం వద్ద ఆదివారం ఆటో బోల్తా పడటంతో పి.చిన్నయ్య(60) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. అట్లూరు మండలం ఎస్.వెంకటాపురానికి చెందిన చిన్నయ్య ఓ పని నిమిత్తం మరో ఇద్దరితో కలసి ఆటోలో బద్వేలుకు వస్తుండగా రాజుపాలెం సమీపంలోకి రాగానే కుక్కలు అడ్డంరావడంతో ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో పి.చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108వాహనంలో వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నరసింహులుకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. మరో మహిళ లక్ష్మీదేవికి స్వల్పగాయాలు అయ్యాయి. మృతుడికి భార్యతో పాటు కొడుకు, కూతురు కలరు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు గ్యారేజ్‌లో అగ్నిప్రమాదం

మదనపల్లె అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రశాతంనగర్‌లో మహ్మద్‌రఫీకి చెందిన కారు గ్యారేజ్‌లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ అగ్నిప్రమాదంలో రూ.లక్షకు పైగా నష్టం కలిగినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం తెలుసుకున్న అగ్రిమాపక అధికారి శివప్ప తన సిబ్బందితో అక్కడికి చేరుకునేటప్పటికే కారు గ్యారేజ్, టాటా నెక్సోన్ ముందు భాగం కాలిపోయింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు అగ్నిమాపక అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాట్సాప్, ఫేస్‌బుక్ యాప్స్ మోసాలకు గురికావద్దు : డీఆర్వో

కడప కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్, పేస్‌బుక్ యాప్స్ మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ప్రజ లకు పిలుపు నిచ్చారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు అధికమవుతున్న తరు ణంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ డీఆర్వో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశా రు. ప్రజలను మోసగించేందుకు నేరస్తులు కొత్త కొత్త మార్గాలను అనుసరిస్తున్నా రన్నారు. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా యాప్స్‌ను ఉప యోగించి ప్రభుత్వ అధికారులు, బ్యాంకు ఉద్యోగుల పేరుతో ఫేక్ ఖాతాలు సృష్టిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ లేదా ఇతర ఉన్నతా ధికారుల ఫొటోలను ఉపయోగించి వాట్సాప్ ఖాతాను సైబర్ నేరగాళ్లు రూపొందిస్తున్నారు. ఆ ఖాతాల ద్వారా అత్యవరసంగా డబ్బు పంపండి అనే సందేశాలు పంపు తున్నారు. కొంత మంది నిజమని నమ్మి ఆ ఖాతాలకు డబ్బులు పంపుతున్నారు. అధికారుల పేరుతో వచ్చే మెసేజ్, కాల్స్‌ను నమ్మవద్దన్నారు. తెలియని లింకులు, ఫొటోలు, ఫైళ్లను ఓపెన్ చేయవద్దన్నారు. వాట్సాప్ డీపీ చూసి నమ్మవద్దని, అనుమానస్పదమైన విషయాన్ని వెంటనే స్థానిక పోలీసులకు తెలపాలన్నారు. సైబర్ నేరాల కట్టడికి ఫిర్యాదు చేయాలంటే హెల్ప్‌లైన్ నెంబరు 1930కి, లేదా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్.జీవోవీకి ఫిర్యాదు చేయాలని డీఆర్వో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో అక్రమ కట్టడాల నిలిపివేత

బ్రహ్మంగారిమఠం, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారి దేవస్థానం మాఢవీధుల్లో దేవస్థానానికి సమీపంలో సాధువుల అన్నదాన సత్రం గతంలో ఉండేది. సర్వే నెం.333/3లో 1.44 సెంట్లు స్థలం ప్రభుత్వ భూమి కలదు. ఇటీవల ఆ స్థలంలో కొందరు అక్రమ కట్టడాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న దేవదాయశాఖ ఈవో వెంకటనరసయ్య పనులను ఆపివేసి వారికి నోటీసులు జారీ చేశారు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ ఈ మధ్యకాలంలో రాత్రికి రాత్రి మళ్లీ కట్టడాలు చేపట్టారు. ఈ విషయం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి కొందరు తీసుకువెళ్లడంతో వెంటనే పనులు ఆపివేయాలని ఎండోమెంటుశాఖ అధికారి వెంకటనరసయ్యకు ఆదే శాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన పనుల వద్దకు వెళ్లి అక్రమ కట్టడాలను నిలిపివేసినట్లు తెలిపారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, మే 4(ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి ప్రభాతసేవ, అభిషేకం, ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ సందర్భంగా ఫిట్ పర్సన్ శంకర బాలాజీ మాట్లాడుతూ గురుపూజా మహోత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, క్యూలైన్లు, భోజనం, తాగునీటి వసతి వంటి ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.



విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

కడప ఎడ్యుకేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పత్రకులస్థుల విద్యార్థులను ప్రోత్సహిస్తూ 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పత్ర కులం విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను జనచైతన్య సంఘం, వీరగురుడు ఫౌండేషన్ తరపున సంయుక్తంగా అందజేయనున్నట్లు వీరగురుడు ఫౌండేషన్ నిర్వాహకుడు తిప్పన్న బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2025 ఇంటర్ పరీక్షల్లో 950మార్కులకు పైగా వచ్చిన జిల్లాలోని పత్రకులానికి చెందిన విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. ఆ విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెమెంటోలతో ఈనెల 7న కడపలోని జనచైతన్య కార్యాలయంలో ఉయం 9గంటలకు సత్కారం చేయనున్నామని తెలిపారు. విద్యార్థులు తమ మార్కుల జాబితా కాపీని, తమ చిరునామా, ఫోన్ నెంబర్‌తో సహా సెల్ నెంబర్ 6303600328కు వాట్సప్ ద్వారా 6వ తేదీన 12 గంటల లోపు పంపాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా వాటర్‌స్కీంలు

చక్రాయపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు వాటర్ స్కీంలు మంజూరయ్యాయి. ఈ వాటర్ స్కీంలకు టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి బోరువేసేందుకు టెంకాయ కొట్టి పనులు ప్రారంభింపజేశారు. నెర్సుపల్లె, చిలేకాంపల్లెలో మావూళ్లమ్మతల్లి బోనాలు సందర్భంగా శివారెడ్డి ఆహ్వానం మేరకు అక్కడికి విందులో పాల్గొన్నారు. అనంతరం యార్లవాండ్లపల్లెలో జరిగే టీడీపీ కార్యకర్త వివాహానికి హాజరయ్యారు. అనంతరం పలు గ్రామాలలో నీటి ఎద్దడిపై సమీక్ష ఏర్పాటుచేసి అడిగి తెలుసుకున్నారు. మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



సూచనలిస్తున్న సీఐ నరసింహులు తదితరులు

వేంపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ నరసింహులు తెలిపారు. వేంపల్లెలోని నాలుగురోడ్ల కూడలి, పులివెందుల ,కడప రోడ్డులో నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. డ్రైవర్లు నిబంధనల మేరకు వాహనాలు నడపాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వేంపల్లెలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రజలందరూ సహకరించాలని సీఐ సూచించారు. ఎస్ఐ తిరుపాలనాయక్, పోలీసు సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



పాట రూపంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాష తెలిపారు. సమ్మర్ క్యాంపులో భాగంగా ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు పాటలు, యోగా, డ్యాన్స్, మీద ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్, లైబ్రేరియన్స్ సుబ్రహ్మణ్యం, సురేష్, జేమ్స్, సుబ్బమ్మ, రమణ, పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రారంభమైన లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

పెండ్లిమర్రి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెయ్యినూతుల కోన లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా బాలాలయ అష్ట బంధన మహోత్సవం ,విశ్వక్సేనారాధన శుద్ధి,పుణ్యాహ వచనం,యాగశాల ప్రవేశం, అంకురార్పణ పూజలు నిర్వహించారు.భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించు కుని పూజలు నిర్వహించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



లింగాల, మే 4 (ఆంధ్రజ్యోతి): లింగాల 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వెలిదండ్ల, పార్నపల్లె సబ్‌స్టేషన్‌ల కోసం నూతనంగా 33కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుచేశారు. అయితే లోపట్నూతల, కర్ణపాపాయపల్లె గ్రామాల మధ్యలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఒరిగిపోయింది. ఏదైన ప్రమాదం జరగక ముందే విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

తడులు లేక తల్లడిల్లిన రైతులు

●ఆరుతడి పంటతో అవస్థలు ●పూర్తి కాకముందే కోసేస్తున్న వైనం



నువ్వులపంట పూర్తి కాకముందే కోసేస్తున్న కూలీలు, గిడస బారిన నువ్వులకాయలు

చెన్నూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు అల్లాడుతున్నారు. పంట చివరి దశలో నీటి తడులు లేక అవస్థలు పడు తున్నారు. దీంతో పంట పూర్తి కాకముందే 15 రోజుల మునుపే కోసేయడం జరుగుతోంది. మండలంలోని కొక్కిరాయలపల్లె రెవెన్యూ పొలాల్లో ఈ మారు పలువురు రైతులు నువ్వులపంట సాగు చేశారు. అయితే ఏప్రిల్ 15 నాటికే కేసీ కాల్వ నుంచి వ్యవసాయ పొలాలకు నీరు ఆపడం జరిగింది. పైగా రబీలో వరి సాగు చేసిన కొందరు రైతులు ప్రస్తుతం కోత దశలో వరి ఉండడంతో కేసీ కాల్వ అధికారులు నీరు వదిలితే కోయాల్సినపంట దెబ్బతింటుందని నీటిని వదలవద్దని చెప్పారు. అదే సమయంలో నువ్వులపంట సాగు చేసిన రైతులు ఇంకో తడి వస్తే పంట పూర్తిగా చేతికి వస్తుందన్న తరుణంలో వరి రైతులు కోత కోసం నీరు నిలపడంతో ఇక నీరు రావనుకుని నువ్వుల రైతులు పంటను కోసేస్తున్నారు. పైగా పంట కోయకుండా అలాగే ఉంచితే అంతో ఇంతో ఉన్న గింజ కూడా నూనె శాతం తగ్గి తేల్కై అమ్మకానికి పనికిరాకుండాపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండిపోయిన నువ్వుల పంట..: కొక్కిరాయపల్లె వ్యవసాయ పొలాల్లో అదే గ్రామానికి చెందిన ఈశరయ్య, చెన్నూరు గ్రామానికి చెందిన పెరుగు రామయ్య మరికొందరు రైతులు నువ్వులపంట సాగు చేశారు. గతంలో వీరు ఖరీఫ్‌లో వరి సాగు చేయగా, అప్పట్లో కురిసిన వర్షాలకు దిగుబడి రాక నష్టపోయారు. చివరికి మరలా రబీలోని నువ్వుల పంట సాగు చేయగా అది చివరి తడి సమయంలో నీరు రాక ఎండిపోయింది.

పంట అంతా పండుబారినట్లు మారింది. గింజలు కూడా సరిగా లేవు. ఉన్న గింజలే బాగుంటే చాలని కోసుకుంటున్నారు. పైగా నీరు సరిగా పారకపోవడంతో నువ్వుల కాయలు సైతం గిడసబారినట్లు మారాయి. ఫలితంగా పేద రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంట రబీలో కూడా నష్టాన్ని తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏం చేస్తాం.. రైతు బతుకు ఇంతే..!



ఏదో బాగుపడదామని ఖరీఫ్‌లో వరి సాగు చేస్తే పంట దెబ్బతిని దిగుబడులు రాకుండా పోయింది. రబీలో ఆరుతడి పంటలు సాగు చేస్తే చివరి సమయంలో నీరు రాలేదు. కాల్వలో నీరు ఉన్నా మా పొలాలకు ఇచ్చేందుకు వేరే రైతులు మాకు వరి కోతలున్నాయి, నీరు నిలిపివేశారు. నీరున్నా కూడా పారించుకోలేని పరిస్థితి. నష్టమో కష్టమో ఏం చేద్దాం, అందుకే పంట కోసేస్తున్నాం.

- పెరుగు రామయ్య, రైతు, చెన్నూరు

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆరోగ్యానికి భరోసా

ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, మే 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పులివెందులలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గంలోని పలువురు ప్రజలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వేముల మండలానికి చెందిన ఎద్దుల గంగాదేవికి రూ.1,20,495, వడ్డెరపు గంగాదేవికి రూ.40,350, సింహాద్రిపురం మండలానికి చెందిన అమృతవాణికి రూ.31,365, వేంపల్లె మండలానికి చెందిన కలమల అంజనమ్మకు రూ.1,30,000, తొండూరు మండలానికి చెందిన నాగమునిరెడ్డికి రూ.67,497 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు.

సినీ నటుడు పద్మనాభం తమ్ముడిని పరామర్శించిన తులసిరెడ్డి



సింహాద్రిపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): సినీ హాస్య నటుడు స్వర్గీయ పద్మనాభం తమ్ముడు 92 ఏళ్ల వయోవృద్ధుడు, సినీ నిర్మాత పురుషోత్తంను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. సింహాద్రి పురంలో జరిగిన పెద్దమ్మ దేవర కార్యక్రమంలో రాజ గోపాల్‌రెడ్డి ఆహ్వానం మేరకు తులసిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరవిందనాథరెడ్డి, చెన్నకేశవ రెడ్డి, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ముగిసిన పెద్దమ్మ దేవర

సింహాద్రిపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురంలో 80 ఏళ్ల తర్వాత నిర్వహించిన పెద్దమ్మ దేవర ఆదివారంతో అంగరంగ వైభవంగా ముగిసింది. పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు, జంతు బలులు నిర్వహించారు, ప్రత్యేక అలంకరణ చేశారు. వీధుల పొడవునా వాహనాల రద్దీ కనిపించింది. అధిక శాతం ప్రజలు పెద్దమ్మ, చౌడేశ్వరి దేవతలకు జంతు బలినిచ్చారు. పెద్దమ్మ దేవతకు బలి, పొలి కార్యక్రమాలు ముగిసిన వెంటనే కొత్తూరు చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



పురవీధులలో జ్యోతుల ఊరేగింపు

ఘనంగా కోగటం ఉరుసు ఉత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోగటం గ్రామంలో వెలసిన సయ్యద్‌షా అలంపీర్ స్వామి వారి ఉరుసు మహోత్సవం రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉరుసు సందర్భంగా దర్గా ఆవరణంలో జన సందోహం మధ్య చాంద్రులకుపూలమాలలు సమర్పించి వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నిర్వాహకులు కే.శే గండ్లూరి పెద్దవీరారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఉరుసు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. లక్ష్మయ్యశెట్టి నివాసం నుంచి గంధం మహోత్సవాన్ని ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు డప్పు వాయిద్యాలతో, బాణసంచా కాల్చుతూ నిర్వహించారు. అనంతరం స్వామివారి మజార్లు ఎక్కించారు. పూలచాదర్లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. గంధం పంచిపెట్టారు.కాగా దర్గాలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి చాదర్ సమర్పించారు. టీడీపీ నాయకుడు ఎల్లారెడ్డి ఆహ్వానం మేరకు ఆ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే దర్గాకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు పుత్తా సాయి నరసింహారెడ్డి,మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతు బజారులో అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసులు

కడప రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి) : అసంఘటిత కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మే డే వారోత్సవాల సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరం రైతు బజారులో వ్యవసాయ కార్మికులకు, మత్స్య కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మికుల కనీస వేతనాల చట్టం, పనివేళలు, ఉద్యోగుల ప్రావిడెండ్ ఫండ్, ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పారాలీగల్ వలంటీర్లు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ



మాచునూరు నుంచి వెల్లటూరు వరకు వేసిన తారురోడ్డు

పెండ్లిమర్రి, మే 4 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా గ్రామీణ రోడ్లకు ఇప్పుడు మహర్దశ వచ్చింది.ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కృషి ఫలితంగా ఎన్నో ఏళ్లుగా తారు రోడ్డు కోసం ఎదురు చూస్తున్న గ్రామీణ ప్రజల ఆశలు నెరవేరబోతున్నాయి.చినుకుపడితే చిత్తడే,అటు వెళ్తే రంగు మారుద్ది..అంతే,హామీలు గుప్పిస్తారు ఆ తరువాత మరుస్తారు అనే వరుస కథనాలతో అధికారుల్లో,ప్రజాప్రతినిధుల్లో చలనం వచ్చి ఎట్టకేలకు గ్రామీణ రోడ్లకు మోక్షం లభించిది.పీఎంజీఎస్‌వై-4 పథకం క్రింద గ్రామాలకు తారురోడ్ల నిర్మానానికి ప్రతిపాదనలు పంపినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి నుంచి యాదవాపురం మీదుగా అలంఖాన్‌పల్లె, కొత్తపల్లె మీదుగా చెర్లోపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు,కడప-పులివెందుల ప్రదాన రహదారి నుంచి మిన్నయ్యగారిపల్లె మీదుగా బారెడ్డివాండ్లపల్లెకు తారురోడ్డు ఏర్పాటుకు అంచనాలు తయారు చేసి పంపారని,వీలైనంత త్వరగా అనుమతులు రాగానే పనులు మొదలవుతాయని తెలిపారు.ప్రస్తుతం మాచునూరు గ్రామం నుంచి కోనాయపల్లె మీదుగా వెల్లటూరు గ్రామం వరకు 3 కోట్ల 50 లక్షల రూపాయలతో తారు రోడ్డు పనులు పూర్తయ్యాయి.

ఆటపాటలతో హోరెత్తిన శిల్పారామం



కడప కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): నగర అఖిల్ డాన్స్ అకాడమీ చిన్నారుల ఆటపాటలతో శిల్పారామం హోరెత్తింది. ఆది వారం ఆట విడుపులో భాగంగా నగర రిమ్స్ సమీప శిల్పారామంలో అక్కడి సాంస్కృతిక కళావేదికపై చిన్నారులు వివిధ జానపద, శాస్త్రీయ, సినీ గీతాలకు చేసిన నృత్యాలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నాయి.

పర్యాటకానికి కేరాఫ్ శిల్పారామం

ఊపందుకుంటున్న సందర్శకుల తాకిడి





కడప కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్‌గా శిల్పారామం నిలుస్తోంది. అసలే విద్యార్థులకు వేసవి సెలవులు. భగభగమండే భానుడి విశ్వరూపంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఉదయం నుంచే వేడి సెగలు అంతకంతకూ పెరుగుతుండడంతో ఇళ్ల నుంచి నగరవాసులు బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం 5 దాటితే కానీ వేడి సెగల నుంచి ఉపశమనం లభించడంలేదు. దీంతో ఇళ్లలో నుంచి ఆహ్లాదకర వాతావరణం కోసం బయటికి వచ్చేవారంతా శిల్పారామం దారి పడుతున్నారు. మామూలు రోజుల్లో సుమారు 400 నుంచి 500 మంది సందర్శకులు శిల్పారామాన్ని సందర్శిస్తున్నారు. సెలవుల్లో మాత్రం దాదాపు 2వేల పైచిలుకు మంది ప్రజలు శిల్పారామాన్ని సందర్శించి సేద దీరుతూ అక్కడి చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. ప్రధానంగా శిల్పారామంలో చిన్న పిల్లలు, పెద్దలు ఆడుకునే పలు రకాల సదుపాయాలున్నాయి. అందులో ప్రధానంగా బోటింగ్, డాషింగ్‌కారు, డబుల్ డెక్కర్ బస్సు (లండన్ బస్సు), వాటర్ వాక్, చిన్నపిల్లల కోసం యానిమేషన్ థియేటరు ఉంది. ఇందులో సైంటిఫిక్, హర్రర్, అడ్వంచర్ తాలూకు 18 నిమిషాల నిడివి గల సినిమాలను ప్రదర్శిస్తుంటారు. అంతేకాకుండా చేతి వృత్తులతో తయారు చేసిన వస్తు ప్రదర్శనశాలలో వివిధ రకాల వస్తువులను అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో పాటు ఈ నెల 3వతేదీ శనివారం నుంచి ప్రత్యేక ప్రొజెక్టరు ద్వారా అన్ని మతాలకు చెందిన భక్తిసినిమాలను శిల్పారామంలో సాయంత్రం 6 నుంచి 7.30 వరకు ప్రదర్శనగావించనున్నారు. త్వరలో ఎద్దులబండి ద్వారా విహరించే ఏర్పాట్లును కూడా నిర్వాహకులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ప్రధానంగా అక్కడున్న డబుల్ డెక్కర్ బస్సులో ప్రయాణం చేయాలనే తపనతో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంది. అక్కడున్న పచ్చిక బయళ్లు ఎంతగానో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఆ గ్రీనరీలో ఫొటోషూట్ కూడా త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అక్కడున్న ఆహ్లాదకర వాతావరణం ద్వారా ప్రొద్దున నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండాలనే ఆకాంక్ష సందర్శకుల్లో తీసుకురావడమే లక్ష్యంగా నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ

కొండాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): కొండాపురం సమీపంలోని కనంమిట్ట వద్ద అభయఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు ఈసందర్భంగా వేదపండితులు హోమాలు, ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బద్వేలు - విజయవాడ నూతనసర్వీసు ప్రారంభం

బద్వేలు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) :బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి రాత్రి 9.30 గంటలకు విజయవాడకు సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజరు నిరంజన్ తెలిపారు. రాత్రి 9.30గంటలకు బయల్దేరే బస్సు ఉప్పలూరు, పామూరు, కందుకూరు సింగరాయకొండ, గుంటూరు మీదుగా విజయవాడకు చేరుతుందన్నారు. తిరిగి విజయవాడ బస్టాండు నుంచి ఉదయం 7.45కు బయల్దేరి బద్వేలుకు సాయంత్రం 3.30గంటలకు చేరుతుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని బద్వేలు ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి

ప్రొద్దుటూరు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిశాలలో ఈనెల 7వ తేదీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు. 7వ తేదీ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు. లోక కల్యాణార్థం చండీ హోమం నిర్వహించి పూర్ణాహుతి సాయంత్రం 7 గంటలకు 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్ల దుస్థితి మారేదెన్నడో..?

- రెండేళ్ల క్రితం పైపులైను తవ్వకాలు
- విస్తరణ పేరిట వాయిదాపడ్డ రోడ్ల నిర్మాణం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు, పాలకమండలి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


పైపు లైను గుంతలతో అధ్వానంగా ఉన్న బొల్లవరం - రామేశ్వరం లింకు రోడ్డు


అధ్వానంగా ఉన్న బొల్లవరం ఎస్సీ కాలనీ రోడ్డు

ప్రొద్దుటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో రోడ్ల దుస్థితి దారుణంగా ఉంది. పైప్ లైను కోసం తవ్విన గుంతలతో రోడ్లు దుర్భరంగా మారాయి. పైప్‌లైను గుంతలకు ప్యాచ్ వర్కులు చేయకుండా కొత్త రోడ్లు వేయాలని చెప్పి ఏళ్ల తరబడి వాటిని అలాగే ఉంచడంతో ప్రజలు ముఖ్యంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండేళ్ల క్రితం తాగునీటి సరఫరాలో సూపర్‌బజార్‌వీధి, బురసాధుమఠం, రుషి అపార్ట్ మెంట్ ఏరియా, బాహూజీనగర్ ప్రాంతాలకు ఇబ్బందులు ఉండటంతో బొల్లవరంలోని తాగునీటి రిజర్వాయర్ల నుంచి పైపులైను అనుసంధాన పనులను మున్సిపాలిటీ చేపట్టింది. ఆయాప్రాంతాలకు తాగునీటి సమస్య తీరినా పైపులైను కోసం తీసిన గోతులకు ప్యాచ్ వర్కులు చేయకపోవడంతో బొల్లవరం - రామేశ్వరం లింకు రోడ్డు దారుణంగా తయారైంది.

విస్తరణ పేరిట రోడ్డు నిర్మాణం వాయిదా

బొల్లవరం - రామేశ్వరం లింకు రోడ్డును 60 అడుగుల మేర మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరించే పనులు చేపట్టాలని పాలక మండలి ప్రయత్నించింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. దీంతో గతంలో పైప్‌లైను కోసం తవ్విన గుంతలకు సైతం ప్యాచ్ వర్కులు చేయకుండా విస్తరణ పనులు పూర్తయ్యాక చేపడతామని అనుకోవడంతో రెండేళ్లకు పైబడి జాప్యం జరిగింది. మధ్యలో అసెంబ్లీ పార్లమెంటుకు ఎన్నికలురావడంతో ఆ పనులు అటకెక్కాయి.

రూ.22.18 లక్షలతో టెండర్లకు పిలిచారు

రామేశ్వరం - బొల్లవరం లింకురోడ్డును మడూరు ఛానల్‌వరకు సీసీ రోడ్డు నిర్మాణం కొరకు 2020-21 ఆర్థిక సంవత్సరానికి రెండవ విడత 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.22.18 లక్షల అంచనాతో టెండర్లకు పిలిచాం. మే 6 తేదీన టెండర్లు ఖరారు చేస్తాం. టెండరు ప్రక్రియ పూర్తికాగానే రోడ్డు నిర్మాణం చేపడతాం.
-మల్లికార్జున,
మున్సిపల్ కమిషనర్ ,ప్రొద్దుటూరు

ఫ్యాక్టరీ సిబ్బందిపై దౌర్జన్యం.. కేసు నమోదు

ముద్దనూరు మే3(ఆంధ్రజ్యోతి):మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో సర్వీసెస్ కంపెనీకి సంబంధించిన సిబ్బంది పై పెద్దదుద్యాల గ్రామానికి చెందిన సింగం శివమోహన్‌రెడ్డి, శివప్రసాద్ రెడ్డిలు దౌర్జన్యానికి పాల్పడడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ వివరాలమేరకు శివమోహన్‌రెడ్డి మార్చి 3 వతేదీన కంపెనీ వద్దకు వెళ్లి కంపెనీ కార్యకలాపాలను అడ్డుకుని కార్యకలాపాలు సాగాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించారన్నారు. దానికి కంపెనీ వారు స్పందించకపోవడంతో గత నెల 28వ తేదీన జిల్లా కలెక్టర్‌కు కంపెనీపై ఫిర్యాదు చేశారన్నారు. దీంతో శనివారం కడప పొల్యూషన్ బోర్డు అధికారులు ఫ్యాక్టరీ పరిశీలనకు వచ్చి పరిశీలిస్తున్న సమయంలో శివమోహన్‌రెడ్డి ఫ్యాక్టరీ వద్దకు వచ్చి ఫ్యాక్టరీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా అక్కడ సిబ్బంది లోనికి అనుమతిలేదన్నారు. దీంతో అతను వారిపై దౌర్జన్యానికి దిగాడన్నాడు. కంపెనీ మేనేజర్ ప్రదీప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం

ప్రొద్దుటూరు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత టీవీఎస్ థియేటర్ వద్ద బాహుబలి ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించడంతో షాపులోని ప్లాస్టిక్ డైనింగ్ టేబుళ్లు, కుర్చీలు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు కాలిపోయాయి. అగ్నిప్రమాదం వలన రూ.30 వేలు ఆస్తినష్టం జరిగినట్లు షాపు నిర్వాహకులు తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన విషయం అగ్నిమాపక శాఖ అధికారులకు తెలియజేయడంతో వారు వచ్చి షాపులో కాలిపోయిన ఫర్నీచర్‌ను పరిశీలించారు.

దువ్వూరులో ఆగిన నీటి సరఫరా.. ఆందోళనలో ప్రజలు

దువ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి):దువ్వూరులో గ్రామపంచాయతీ పరిధిలో మూడు రోజులుగా నీటి సరఫరా జరగపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా పంచాయతీ పరిధిలోని వీధులకు మూడు రోజుల నుంచి నీటిసరఫరా జరగడం లేదు. అసలే వేసవి ఎండలతో ఇబ్బందులు పడుతున్న జనాలకు తాగునీరు లేక వారి అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. ఇంత జరుగుతున్న అధికారులు ఎందుకు స్పందించడంలేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా తాగునీటి విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను సంప్రదించగా మోటారు చెడిపోయిందని, దాన్ని బాగు చేసి నీటి సరఫరా కొనసాగిస్తామని చెప్పారు.

కొప్పర్తి పారిశ్రామిక వాడను అభివృద్ధి పరచండి

బద్వేలు ,మే 4(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతితో పాటు కొప్పర్తి పారిశ్రామికవాడను కడప, ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణం కోసం వచ్చిన ప్రధాని నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం నిధులు ఇతోధికంగా ఇచ్చామని బహిరంగ సభలో చెప్పడం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయడమేన్నారు. రాష్ట్రానికి వాటాగా రావాల్సిన నిధులు సక్రమంగా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నీట్

- పట్టణంలో తొలిసారిగా పరీక్ష
- సీసీ కెమెరాలు, జామర్లు ఏర్పాటు


విద్యార్థులను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలో ప్రవేశానికి నిర్వహించిన నీట్ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో మొదటిసారిగా నీట్ నిర్వహించారు. పరీక్షకోసం వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 రెండు గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్ష సందర్భంగా ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్ష కేంద్రాల వద్ద జామర్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి మెటల్ డిక్టేటర్ ద్వారం ద్వారా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 360 మంది విద్యార్థులను కేటాయించగా 355 మంది పరీక్షకు హాజరయ్యారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో 172 మంది విద్యార్థులకుగాను 168 మంది పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను డీఆర్‌వో విశ్వేశ్వరనాయుడు, జమ్మలమగుడు ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు గంగయ్య, డీఎస్పీ భావన పరిశీలించారు. పరీక్షలు పురష్కరించుకుని పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా మధ్యాహ్నం 12.30 నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు.

అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, త్రిశూలపూజ, అంకురార్పణ, సాయంత్రం ధ్వజారోహనం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు రోడ్డులోని కొశెట్టి హైస్కూలు 2004-05 బ్యాచ్ 10వ తరగతి పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన సమావేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆత్మీయంగా పలుకరించుకుని బడిలో చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎంఈవో సావిత్రమ్మ, పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో సావిత్రమ్మ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల పూర్వవైభవానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొశెట్టి చిన్న వెంకటసుబ్బయ్య మనుమరాలు వాణి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జయంతి

రాజుపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోరికలు తీర్చే కల్పతరువు గ్రామ దేవత గంగమ్మ జయంతి ఉత్సవాలు ఆదివారం అర్కటవేముల గ్రామంలో పాతగంగమ్మ ఆలయం వద్ద అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పెద్దఎత్తున మహిళలు గ్రామదేవతలకు పూజలు చేశారు. తమను చల్లగా కాపాడాలంటూ గంగమ్మతల్లికి నీరాజనాలు పలికారు. రాత్రి ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

అంకాలమ్మా! చల్లంగా దీవించమ్మా..!

పోరుమామిళ్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): అంకాలమ్మా చల్లంగా దీవించమ్మా అంటూ మండలంలోని తిరువెంగలాపురం గ్రామానికి చెందిన ప్రజలు, మహిళలు అంకాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. ఆదివారం పోరుమామిళ్ల మండలంలోని రాజసాహెబ్‌పేట పంచాయతీ పరిధిలోని తిరువెంగలాపురంలో అంకాలమ్మకు గ్రామప్రజలంతా బోనాలు సమర్పించి కానుకలు సమర్పించారు. . అలాగే మండలంలోని దాసరపల్లె గ్రామంలో సీతారామలక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కవలకుంట్ల సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

పోరుమామిళ్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామేశ్వరం, బూరుగమానుపల్లె గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్‌రెడ్డి ట్యాంకర్లతో నీటి సరఫరా చేసి గ్రామస్తుల సమస్యను పరిష్కరించారు. గత రెండురోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలకు నీటి సమస్య ఉత్పన్నం కాగా ఎంపీడీవో రమణారెడ్డి, సర్పంచ్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సమస్యను పరిష్కరించారు.

కాశినాయన ఎస్ఐగా యోగేంద్ర నియామకం

కాశినాయన మే4(ఆంధ్రజ్యోతి): కాశినాయన మండల ఎస్ఐగా పి.యోగేంద్రను ప్రభుత్వం నియమించింది. బదిలీలల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ హనుమంతు ప్రొద్దుటూరు త్రీ టౌన్‌కు వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న యోగేంద్ర కాశినాయన మండలానికి వచ్చారు.ఆమేరకు ఆదివారం నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో భాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ యోగేంద్ర మీడియాతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా భావించి పనిచేస్తానన్నారు.

బ్రహ్మంగారిమఠం దేవస్థానం అభివృద్ధే లక్ష్యం


కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం, మే 4 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన సృష్టికర్త, భూత భవిష్యత్ వర్తమాన కాలాన్ని ముందుగానే తెలియజేసిన కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు 4వతేదీ నుంచి మే 9 వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సందర్భంగా దేవదాయశాఖ అధికారి దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ ఆదేశాల మేరకు బ్రహ్మంగారిమఠం దేవస్థానాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఇటీవల రూ.3కోట్లుతో నిర్మాణం చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇటీవల ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం, యాత్రికుల విశ్రాంతి గదులు, పోలేరమ్మ దేవస్థానం వద్ద సీసీ రోడ్లు ప్రారంభం అలాగే ప్రధాన ఆలయం వద్ద సిబ్బంది ఆఫీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి రూ.3కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. భక్తుల సౌకర్యాల కోసం బస్టాండు లేకపోవడంతో తాత్కాలిక బస్‌షెల్టరు నిర్మాణం చేపట్టుకోవాలని రూ.10లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆరాధన గురుపూజా మహోత్సవాల్లో భాగంగా మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, యువ నాయకులు కాణాల మల్లిఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు 3వేల మజ్జిగ ప్యాకెట్లు ఆదివారం మొదటి రోజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, చిలమల నాగయ్య, దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ, ఈశ్వరీదేవి మఠం పీఠాధిపతి శ్రీ వీరకుమారస్వామి, పెరుగు నాగేంద్ర, గుజ్జు రామాంజనేయులు, ఓబులపతినాయుడు, నరసింహగౌడ్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గో సేవ భగవంతుని సేవలాంటిది : ఎమ్మెల్యే


గోవుకు దాణా అందిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తదితరలు

ప్రొద్దుటూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): గోమాతలకు సేవ చేయడం దేవునికి సేవ చేయడంతో సమానమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మండల పరిధిలోని కామనూరు గ్రామంలో ఉన్న గోశాలలో ఆదివారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. తదనంతరం గోవులకు ఆకుకూరలు కూరగాయలు పండ్లు ఆహారంగా అందించారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని గోవులకు పండ్లు, ఆకుకూరలు కూరగాయలు, తౌడు తినిపించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు మల్లికార్జునరావు, వంకదార వీరభద్రయ్య, డాక్టరులక్ష్మీనరసయ్య, బి.వెంకటరామిరెడ్డి, బీజేపీ నాయకుడు నరేంద్ర గో సేవకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

మైదుకూరు రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మండలంలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మండలంలోని ముద్దిరెడ్డిపల్లె కోదండరామాలయం భూమి పూజ కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.అనంతరం నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బీమయ్య, కాలువ గురప్ప, నేట్లపల్లి మల్లికార్జున్‌యాదవ్, చిన్‌రెడ్డి లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఉచిత సామూహిక వడుగులు


ఉచిత సున్నతి కార్యక్రమానికి హాజరైన బాలురు పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రి, కమిటీవారు

జమ్మలమడుగు, మే 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని పలగాడి వీధిలో గౌషియా షాదీఖానా వద్ద ఆదివారం ఉదయం పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రి ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వడుగుల (ఖత్నా) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పెద్ద ఆస్తానములవారి 93వ ఉరుసు మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఉచిత ఖత్నా సుంతి కార్యక్రమం స్థానిక పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రి, ఆయన కుమారుడు తాహీర్‌పీరాఖాద్రి, కమిటీవారు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన 75 మంది చిన్నారులకు సామూహిక వడుగుల కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ వారు తెలిపారు. కార్యక్రమంలో గౌషియాషాదీఖానా కమిటీవారు ఎస్.మహమ్మద్‌గౌస్, దాదాపీర్, జహంగీర్‌బాష, చాపాడు మహమ్మద్‌గౌస్, ఎంఎంబాష, రజాక్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో వీఎస్ ముక్తియార్

ప్రొద్దుటూరు టౌన్‌లో: పేద ముస్లిం బాలురకు హబీబున్నీసా మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వడుగులకు విశేష స్పందన లభించింది. ఆదివారం ఖాదర్‌హుస్సేన్ మసీదు వీధిలోని వైఎస్ఆర్ పార్కులో 150 మంది బాలురకు వడుగులు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ 1980 నుంచి ఇస్లామియా షాదీ కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు ఉచిత వివాహాలు, వడుగులు కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖ్వాజీలు ముల్లా నజీర్ అహ్మద్, మౌలానా ఆరీఫ్‌వుల్లా, పట్టణ ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు హఫీజ్, ఖాజాబాష, ఖలీల్, జనసేన నాయకుడు జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శిగా లక్షుమయ్య



జమ్మలమడుగు, మే 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిదిలోని కన్నెలూరు గ్రామానికి చెందిన గజ్జెల లక్షుమయ్య వైసీపీ రాష్ట్ర బీసీసెల్ సెక్రటరిగా నియమితులయ్యారు. ఆమేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి జమ్మలమడుగులో ఆ పార్టీకి సేవలు అందిస్తున్నానన్నారు. ఈ మేరకు ఎంపీ అవినాష్‌రెడ్డి, స్థానిక వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో అధిష్ఠానం రాష్ట్ర బీసీసెల్ సెక్రటరిగా నియమించినందుకు పార్టీకోసం సేవ చేస్తానన్నారు.

ఆక్రమణదారులపై కేసు నమోదు చేయాలి

పోరుమామిళ్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం చెరువు సర్వే చేసి అక్రమార్కులపై కేసునమోదు చేయాలని హ్యూమన్ రైట్స్ జాయింటు కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు కోరారు. రంగసముద్రం చెరువు దాదాపు 279 ఎకరాలను కొందరు దొంగపట్టాలు సృష్టించుకుని ఆక్రమించకున్నారని వాటిని తహసీల్దారు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర

దువ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలోని ఏకోపల్లె, మనేరాంపల్లె గ్రామాల్లో ఆదివారం గంగమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అమ్మవారికి బోనాలు తీసుకెళ్లి మొక్కుబడులు తీర్చుకున్నారు. మనేరాంపల్లెలో కూడా గంగ జాతర కార్యక్రమాలు చేపట్టారు. మూడు రోజులపాటు పూజా కార్యక్రమాలు, ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. కాగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ రెండు గ్రామాల్లో జరిగిన జాతరలో పాల్గొన్నారు. దేవాలయాలను సందర్శించి గంగమ్మ దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ రమణారెడ్డి, నాయకులు రాంబాబు, బాస్కర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.